సాక్షి ప్రకాశం

గురువారం | 16 | ఫిబ్రవరి | 2023



మహాశివరాత్రి ఉత్సవాలకు భైరవకోన ముస్తాబు

మహాశివరాత్రి ఉత్సవాలకు జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం భైరవకోన ముస్తాబైంది. - IIలో..



వైజాగ్‌లో కిడ్నాప్.. తాడివారిపల్లిలో హత్య

నంద్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడిని తాడివారిపల్లి చెక్‌పోస్టు వద్ద హత్య చేశారు. - IIలో..

గరిష్ఠం/కనిష్టం 33 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

త్రిపురాంతకం ఆలయ ముఖద్వారం నేడు ప్రారంభం

- మంత్రి సురేష్ సొంత నిధులు రూ.30 లక్షలతో నిర్మాణం



త్రిపురాంతకం ఆలయాల వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ముఖ ద్వారం

త్రిపురాంతకం: శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ముఖద్వారాన్ని గురువారం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించనున్నట్లు ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి తెలిపారు. త్రిపురాంతకం ఆలయాల వద్ద మంత్రి సురేష్ రూ.30 లక్షల స్వంత నిధులతో ముఖ ద్వారాన్ని నిర్మించారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ ముఖ మండపాన్ని ప్రారంభించనున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. చరిత్ర కలిగిన పురాతన శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం కుమారగిరిపై వెలసి ఉంది. ఈ ఆలయాల ఘాట్ రోడ్డు మార్గంలో ముఖద్వారాన్ని నిర్మించారు. దశాబ్దాల కాలంగా ముఖద్వారం నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిర్మాణానికి అవసరమైన నిధులను మంత్రి సురేష్ స్వంతంగా ఆయనే ఖర్చు చేయడం విశేషం. భక్తులు కోరుకున్న విధంగా దీనిని అద్భుతంగా ఇంజినీర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కార్మికులు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారు.

నీరు-చెట్టు పథకం బిల్లులు త్వరగా చెల్లించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



నీరు-చెట్టుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: నీరు-చెట్టు పథకంలో పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో పథకం సమన్వయ సమావేశం నిర్వహించారు. మట్టి పనులు, పూడికతీత, గట్లు పటిష్టపరచడానికి చేపట్టి పనులు, వాటి బిల్లుల చెల్లింపులకు సంబంధించిన విషయాలపై సమీక్షించారు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు మరో శాఖతో పరిశీలన చేయాలని, చేసి నివేదిక అందిన తర్వాత చెల్లింపులు చేయాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల ప్రకాశం



పారిశ్రామిక ప్రగతితో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాయితీలు ఇస్తోంది. ఫలితంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే జిల్లాలో రూ.152 కోట్లతో 201 పరిశ్రమలు కొత్తగా ఏర్పడ్డాయి. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో పాటు సీడీపీల ద్వారా పరిశ్రమలకు తోడ్పాటునిస్తోంది. అదే సమయంలో ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తోంది.

- ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు వడివడిగా అడుగులు
- సుమారు 100 ఎకరాల్లో రూ.201.22 కోట్ల వ్యయంతో ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటికే జరుగుతున్న భూ సేకరణ పనులు
- రూ.30 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం
- 2019 నుంచి 1406 పరిశ్రమలకు రూ.171.07 కోట్ల రాయితీ
- 25 భారీ పరిశ్రమలు, 2899 ఎంఎస్ఎంఈ పరిశ్రమలు
- సుమారు 50 వేల మందికి ఉపాధి

ఒంగోలు అర్బన్: జిల్లాలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుతో పాటు సీడీపీ (క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్)లతో జిల్లా ప్రకాశించనుంది. ఆ మేరకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాలో యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యం కల్పించేలా ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా జిల్లాలో 2022–23 సంవత్సరంలో రూ.152 కోట్లతో 201 పరిశ్రమలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటిలో సుమారు 1600 మందికి ఉపాధి లభించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కోట్లాది రూపాయల రాయితీలు ఇచ్చింది. అంతేకాకుండా చిన్న, మధ్య తరహా

15 ఏళ్లకు ప్రణాళికలు

జిల్లాలో ఉన్న వనరుల మేరకు భారీ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు కొత్తగా నెలకొల్పేందుకు యువతను ప్రోత్సహించడం అవసరమైన నైపుణ్య శిక్షణలు ఇవ్వడం, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి అండగా ఉండటం వంటి చర్యలపై రాబోయే 15 సంవత్సరాలకు అవసరమైన ప్రణాళికలను కలెక్టర్ సిద్ధం చేస్తున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో కొత్తగా పరిశ్రమలు నెలకొల్పేలా పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ ముఖద్వారం

పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. అంతేకాకుండా సీడీపీల ద్వారా పరిశ్రమలకు తోడ్పాటునిస్తోంది.

పరిశ్రమలకు చేయూత:

జిల్లాలో ఇప్పటికే 25 భారీ పరిశ్రమలు, 2899 ఎంఎస్ఎంఈ (చిన్న, మధ్య తరహా) పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో భారీ పరిశ్రమల్లో సుమారు 8 వేల మంది, ఎంఎస్ఎంఈల్లో 35 వేల మంది ఉపాధి పొందుతున్నారు. అయితే ఈ పరిశ్రమలు ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తోంది. 2019 నుంచి జిల్లాలో 1406 పరిశ్రమలకు రాయితీ కింద రూ.171.07 కోట్లు అందజేసింది. 2019–20లో 242 పరిశ్రమలకు రూ.23.76 కోట్లు, 2020–21లో 220 పరిశ్రమలకు రూ.48.26 కోట్లు, 2021–22లో 375 పరిశ్రమలకు రూ.33.6 కోట్లు, 2022–23లో ఇప్పటి వరకు 569 పరిశ్రమలకు రూ.65.98 కోట్లు రాయితీ ఇచ్చింది.

ఎంఎస్ఎంఈ పార్కులతో కొత్త పరిశ్రమలు:

జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ వేగవంతంగా చర్యలు ప్రారంభించారు. 99.27 ఎకరాల్లో రూ.201.22 కోట్ల వ్యయంతో ఎంఎస్ఎంఈ పార్కులు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దొనకొండ మండలం రాగముక్కలపల్లి, పామూరు మండలం మాలకొండాపురం వద్ద ఈ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ పార్కులు సిద్ధమైతే వీటిలో సుమారు 20 వేల మందికి ప్రత్యక్షంగా, మరో పది వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

సీడీపీలతో పరిశ్రమలకు అండగా...

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీడీపీ)లతో పరిశ్రమలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా ఏర్పాటు చేయనున్నారు. రూ.30 కోట్ల వ్యయంతో చీమకుర్తి, గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద రెండు సీడీపీలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు. చీమకుర్తిలో ఏర్పాటు చేసే సీడీపీ గ్రానైట్ పరిశ్రమలకు, గ్రోత్‌సెంటర్‌లో ఏర్పాటు చేసే సీడీపీ నిర్మాణ రంగానికి సంబంధించిన పరిశ్రమలకు వెన్నుదన్నుగా ఉండనున్నాయి.

> **వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానంతో యువత ముందుకు రావాలి**
>
> 
>
> పరిశ్రమలు స్థాపించేందుకు యువత వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు రావాలి. అలా వచ్చిన యువతకు పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తాం. తద్వారా వాళ్లు ఎదగడంతో పాటు ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చు. అదేవిధంగా జిల్లా, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చు. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన అన్నీ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. ప్రభుత్వం కూడా పరిశ్రమల స్థాపనకు చేయూతనిస్తోంది. రాయితీలు అందిస్తోంది. జిల్లాలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా పరిశ్రమలకు అవసరమైన వాటిలో నైపుణ్య శిక్షణ ఇస్తూ జిల్లాలోనే యువతకు ఉపాధి కల్పించడంతో పాటు పరిశ్రమలకు మ్యాన్‌పవర్ ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకున్నాం.
>
> – ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

శివరాత్రికి 710 ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న ఈడీ ఆదాం సాహెబ్, పక్కన డీఎం నరసింహులు

- భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ సిద్ధం
- నెల్లూరు ఈడీ ఆదాం సాహెబ్ వెల్లడి

మార్కాపురం: గుంటూరు జిల్లా కోటప్పకొండ, నంద్యాల జిల్లా శ్రీశైలం, ప్రకాశం జిల్లా త్రిపురాంతకం పుణ్యక్షేత్రాలకు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల కోసం 710 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నట్లు నెల్లూరు జోన్ ఆర్టీసీ ఈడీ ఆదాం సాహెబ్ తెలిపారు. మార్కాపురం బస్టాండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటప్పకొండ జాతరను రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫెస్టివల్‌గా ప్రకటించిందని, సుమారు 4 లక్షల మంది వరకు భక్తులు కొండకు రావచ్చని అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లను ఆర్టీసీ పరంగా చేపట్టినట్లు తెలిపారు. కోటప్పకొండ ఘాట్ రోడ్డుకు 80 బస్సులు, చిలకలూరిపేట డిపో నుంచి 120, నర్సరావుపేట నుంచి 180, చీరాల నుంచి 35, ఒంగోలు నుంచి 35, అద్దంకి నుంచి 25 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సుమారు 2,500 మంది సిబ్బందిని కోటప్పకొండ ఉత్సవాలకు వినియోగిస్తున్నామని, ఇందులో 40 మంది సీనియర్ అధికారులు, 200 మంది సూపర్‌వైజర్లు, మిగిలిన వారు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది సేవలకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మార్కాపురం–శ్రీశైలం 90 బస్సులు:

18న శివరాత్రి పండుగను పురస్కరించుకొని మార్కాపురం నుంచి శ్రీశైలానికి 90 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఒంగోలు, పొదిలి, అద్దంకి ఇతర డిపోల నుంచి 60 బస్సులు శ్రీశైలానికి వెళ్తాయన్నారు. దోర్నాలలో తాత్కాలికంగా బస్ స్టేషన్ ఏర్పాటు చేసి యాత్రికులకు మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. త్రిపురాంతకం పుణ్యక్షేత్రానికి మార్కాపురం డిపో నుంచి 8 బస్సులు తిప్పుతామని, వినుకొండ నుంచి కూడా 10 ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.

పీపీపీ పద్ధతిలో మార్కాపురం బస్‌స్టాండ్‌కు ప్రతిపాదనలు:

ప్రైవేట్, పబ్లిక్, పార్టనర్‌షిప్ పద్ధతిలో జిల్లాలో మొదటి సారిగా మార్కాపురం డిపోను ఆధునిక సౌకర్యాలతో నిర్మించేందుకు పీపీపీ పద్ధతిలో బిల్డర్స్‌ను ఆహ్వానిస్తున్నామని, వీరికి 33 సంవత్సరాల పాటు డిపోను లీజ్‌కు ఇస్తామన్నారు. యర్రగొండపాలెంలో కూడా పీపీపీ పద్ధతిలో బస్టాండ్ నిర్మించేందుకు బిల్డర్స్‌ను ఆహ్వానిస్తున్నామని 15 ఏళ్లకు లీజ్‌కు ఇస్తామన్నారు. ఇవి కేవలం ప్రతిపాదనలు మాత్రమేనని, శివరాత్రి తరువాత బిల్డర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. దోర్నాలలో ఎకరా స్థలంలో బస్టాండ్‌ను కడతామన్నారు.

నెల్లూరు పరిధిలో 187 హైర్‌బస్సులు:

నెల్లూరు జోన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం 187 హైర్‌బస్సులు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో నాన్ ఏసీ, స్లీపర్ బస్సులు కూడా ఉన్నాయని, నెల్లూరు–బెంగళూరు, నెల్లూరు–హైదరాబాద్, ఒంగోలు– హైదరాబాద్ సర్వీసులకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. మార్కాపురానికి కూడా ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం శివరాత్రి ఏర్పాట్లపై డీఎం నరసింహులు, ఏడీఎం కామేశ్వరితో సమీక్షించారు.

రేపటి నుంచి శివరాత్రి సందర్భంగా ప్రత్యేక సర్వీసులు

ఒంగోలు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి కోటప్పకొండ, భైరవకోన, శ్రీశైలం, ఇతర శైవ క్షేత్రాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఒంగోలు, పొదిలి, కనిగిరి, మార్కాపురం డిపోల నుంచి అదనపు బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి సుధాకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఒంగోలు నుంచి కోటప్పకొండకు 45, శ్రీశైలానికి 120 (ఒంగోలు–15, పొదిలి–25, మార్కాపురం–80), కనిగిరి నుంచి భైరవకోనకు 20, పొదిలి నుంచి రామతీర్థానికి 10 బస్సులు నడుపుతామన్నారు. అదనపు చార్జీ లేదని, సాధారణ చార్జీతోనే ప్రత్యేక బస్సులు నడుపుతారని చెప్పారు. శ్రీశైలం వెళ్లేవారికి ముందస్తు రిజర్వేషన్ సదుపాయంతోపాటు దర్శన టికెట్లు రిజర్వేషన్‌తోపాటే పొందే సదుపాయం కూడా ఉందన్నారు. ఒంగోలు నుంచి 13 సర్వీసులకు ఉదయం 6, 7, 10 గంటలకు దర్శన సమయాలతో శీఘ్ర దర్శనం రూ.220లతోను, అతి శీఘ్రదర్శనం రూ.520 (రిజర్వేషన్ చార్జీ అదనం) లతో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి



సామాజిక ప్రవర్తన మార్పు పై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: బాల్య వివాహాలు నియంత్రించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో సామాజిక ప్రవర్తన మార్పుపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో ప్రతి వివాహాన్ని మహిళా పోలీసులు తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయిస్తే కుటుంబ సభ్యులు, పాస్టర్‌లు, పురోహితులు, ఇమామ్‌లపై కూడా కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి నెలా మొదటి బుధవారం, మండల స్థాయిలో రెండో బుధవారం, జిల్లా స్థాయిలో మూడో బుధవారం బాల్య వివాహాల నియంత్రణ కమిటీ సమావేశం జరగాలన్నారు. బాల్య వివాహాల వల్ల సామాజికంగా ఆరోగ్య పరంగా కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బడి ఈడు పిల్లలంతా బడికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ఇచ్చే పోషణ కిట్లు పరిశీలించాలన్నారు. అందచేసిన కిట్లు సద్వినియోగం అవుతున్నాయో లేదో పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆహారం మెనూ ప్రకారం అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీదేవి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, డీఈఓ రమేష్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి, డీసీపీఓ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కోసం వివరాలు నమోదు చేయాలి



ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రైవేటు ఆస్పత్రుల్లో పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు కోసం తక్షణమే అక్కడే వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆధార్ కార్డుల నమోదు, అప్‌డేషన్ అవుతున్న తీరుపై ఆరా తీశారు. అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లిదండ్రుల బయోమెట్రిక్‌తో ఆధార్ కార్డు జనరేట్ చేయాలన్నారు. ఐదేళ్లు దాటిన తర్వాత చిన్నారుల బయోమెట్రిక్ అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పుట్టిన తేదీల్లో మార్పులకు వచ్చే ప్రతి అర్జీని దరఖాస్తుదారుడు గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించాలన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు కూడా ఈకేవైసీ తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో చిన ఓబులేసు, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, డీఈఓ రమేష్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా సమన్వయ అధికారి ఉషారాణి, ఎల్‌డీఎం యుగంధర్, సీఎస్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘాటైన రంగు!



నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద మిర్చి కోస్తున్న మహిళా కూలీలు



నాగులుప్పలపాడు వద్ద క్వాలిటీ మిర్చిని గ్రేడ్ చేస్తున్న మహిళా కూలీలు



కలర్ మిర్చి

తేజ రకం మిర్చి పంటను ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఒంగోలు, నాగులుప్పలపాడు, ఇంకొల్లు, పర్చూరు, చీరాల, మార్టూరు, యద్దనపూడి తదితర మండలాల్లో విరివిగా పండిస్తున్నారు. ఈ రకం మిర్చి పంటను పెయింటింగ్స్ (కలర్స్) లలో వాడతారు. అలాగే ఈ మిర్చి నుంచి తీసిన ఆయిల్‌ని సముద్రంలో నుంచి క్రూడ్ ఆయిల్ సేకరించేందుకు వాడతారు.

– ఫొటోలు: ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు



అమ్మనబ్రోలు వద్ద మిర్చిని రాశిగా పోస్తున్న మహిళ



అమ్మనబ్రోలు వద్ద మిర్చిని ఎండబెడుతున్న రైతులు



క్లుప్తంగా

వ్యభిచారం కేసులో నలుగురు అరెస్టు

పామూరు: వ్యభిచారం కేసులో నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. బుధవారం పామూరు ఎన్‌జీఓ కాలనీ 6వ లైన్‌లోని ఓ నివాసం వ్యభిచారం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఐ కాటూరి శ్రీనివాసరావు, ఎస్సై కే.సురేష్ యాదవ్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలానికి చెందిన ఇద్దరు విటులతోపాటు ఇంటి యజమాని నెట్టూరి పిచ్చమ్మ, నిర్వాహకురాలు షేక్.ముంతాజ్‌ను అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా బాధితురాలిని హోంకు తరలించినట్లు చెప్పారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

కందుకూరు: పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్ మాధవరావును సస్పెండ్ చేస్తూ ఎస్పీ విజయారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ప్రవర్తనా నియమావళిలో భాగంగా హెడ్‌కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా స్టేషన్ ఎదురుగా రోడ్డుపై వ్యాపారం చేసుకునే ఓ మహిళ పట్ల మాధవరావు అసభ్యకరంగా ప్రవర్తించడంతో సదరు మహిళ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన ఎస్పీ స్థానిక పోలీస్ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకున్నారు. దీని ప్రకారం హెడ్‌కానిస్టేబుల్ సదరు మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవరించినట్లు రుజువు కావడంతో ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ మాధవరావును సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పోలీస్ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా హెడ్‌కానిస్టేబుల్‌ని సస్పెండ్ చేసినట్లు ఈ సందర్భంగా డీఎస్పీ కండే శ్రీనివాసులు ధ్రువీకరించారు.

కొడుకు నుంచి రక్షణ కల్పించండి

- పోలీసులను వేడుకున్న బాధితురాలు

మార్టూరు: కన్న కొడుకు దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు తన ఇంట్లోకి తాను వెళ్లానని.. కొడుకు, కోడలు నుంచి రక్షణ కల్పించాలంటూ బుధవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. ద్రోణాదుల గ్రామానికి చెందిన నూతక్కి జయమ్మ (72)పై ఈ నెల 4వ తేదీన ఆమె కన్న కొడుకు వీరనారాయణ అత్యంత దారుణంగా దాడి చేయగా ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన విషయం పాఠకులకు విదితమే. గుంటూరు వైద్యులు జయమ్మను పరీక్షించి వెన్నుపూస రెండు చోట్ల విరిగిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెకు ఆపరేషన్ చేసే వీలుకాదని, మూడు నెలల తరువాత చేయాలంటూ వైద్యులు తెలిపినట్లు జయమ్మ వివరించింది. ఈ క్రమంలో 11 రోజుల చికిత్స అనంతరం బుధవారం రాత్రి జయమ్మ గుంటూరు నుంచి ద్రోణాదల వెళ్తూ అంబులెన్స్‌తో పాటు స్థానిక పోలీస్టేషన్‌కు వచ్చింది.

తాను, తన భర్త కలిసి నిర్మించుకున్న ఇంట్లోకి తనను వెళ్ళకుండా తన కుమారుడు వీరనారాయణ తిరిగి దాడి చేసే ప్రమాదమున్నందున తనకు రక్షణ కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. ఎస్‌ఐ కమాలాకర్ ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు
భైరవకోన ముస్తాబు


భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు


శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భైరవకోన ట్రస్టు బోర్డు చైర్మన్ రమణారెడ్డి

- ఆలయాల సముదాయంలో ప్రత్యేక క్యూలైన్లు
- స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లు పూర్తి
- ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సీఎస్‌పురం: ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోన మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భైరవేశ్వర స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆలయాల సముదాయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జలపాతం వద్ద భక్తులు స్నానమాచరించేందుకు వీలుగా స్నాన ఘట్టాలను శుభ్రం చేయించి నీటితో నింపారు. వాహనాల పార్కింగ్‌కు, దాతలు తాత్కాలిక అన్నదాన సత్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వాహనాల పార్కింగ్ స్థలం నుంచి ఆలయం వద్దకు ఉచిత వాహన సౌకర్యం కల్పించనున్నట్లు ఈఓ, ట్రస్టు బోర్డు చైర్మన్లు పేర్కొన్నారు. అలాగే క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా వలంటీర్లను ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో మహా శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, సభ్యుడు అద్దంకి రమణయ్య, ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజా కార్యక్రమాలు

మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 18వ తేదీన భైరవకోనలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ, ట్రస్టు బోర్డు చైర్మన్ తెలిపారు. వేకువజామున స్వామి వారికి రుద్రాభిషేకం, త్రిముఖ దుర్గాదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చన, అనంతరం స్వామి వారికి రుద్రహోమం, మహా మృత్యుంజయ హోమం, మహా పూర్ణాహుతి, అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

వైజాగ్‌లో కిడ్నాప్.. తాడివారిపల్లెలో హత్య


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పొదిలి సీఐ సుధాకర్‌రావు


సంఘటన స్థలంలో మృతదేహం

- ఘాట్ రోడ్డులో కాలిన మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- అక్రమ సంబంధమే దేవధరణి హత్యకు కారణం
- యువతితో వల విసిరి, క్లోరోఫామ్ ఇచ్చి దారుణ హత్య
- హత్య వివరాలు వెల్లడించిన దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

పొదిలిరూరల్: ఒంగోలు–నంద్యాల రహదారిలో తాడివారిపల్లె చెక్‌పోస్ట్ సమీపంలో కాలిన మృతదేహం కేసులో మిస్టరీ వీడింది. అక్రమ సంబంధం నేపథ్యంలో బత్తుల దేవధరణి అనే యువకుడిని దారుణంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బుధవారం రాత్రి పొదిలి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి యువకుడి హత్య కేసు వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం పెద్ద ఎమ్మనూరు గ్రామానికి చెందిన బత్తుల దేవధరణి(22) చిన్నప్పటి నుంచి చెడు వ్యవసనాలకు బానిసై తిరుగుతుండేవాడు. మహిళలకు ఫోన్ చేసి మాట్లాడటం, ఆకతాయితనంగా ఉండటంతో తన అన్న పవన్‌సాయి విశాఖపట్టణంలో తన దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడే ఇంటర్ వరకు చదివించడంతోపాటు ఓ రెస్టారెంట్లో పనిలో చేర్చాడు. చదువు మధ్యలో ఆపేసిన దేవధరణి నిత్యం సామాజిక మాధ్యమాల్లో చాటింగ్ చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో గంగ అనే యువతి పరిచయం కాగా ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. గంగకు ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తితో ముందే అక్రమ సంబంధం ఉంది. దీంతో దేవధరణి, ప్రవీణ్‌కుమార్ మధ్య తరచూ వివాదం నడుస్తోంది. వీరిద్దరితో పవన్‌సాయి మాట్లాడి సర్దుబాటు చేసినప్పటికీ గంగతో దేవధరణి చాటింగ్ చేయడం మాత్రం ఆపలేదు. దీంతో దేవధరణిని అడ్డు తొలగించాలని ప్రవీణ్‌కుమార్ పథకం రచించాడు. అహోబిలం వెళ్లేందుకని చెప్పి జనవరి 30న బాడుగకు కారు మాట్లాడాడు. మనోజ్, చాణక్య, శివకుమార్, నరేష్, స్వప్న అనే యువతితో దేవధరణిని నమ్మబలికించి కారులో ఎక్కించారు. మార్గమధ్యంలో దేవధరణికి క్లోరోఫామ్ ఇచ్చి స్పృహలో లేకుండా చేశారు. క్లోరోఫామ్ ప్రభావంతో దేవధరణి కారులోనే మలమూత్రాలు విసర్జించడంతో తర్లుపాడు మండలం తాడివారిపల్లె ఘాట్ రోడ్డులో కారు ఆపి కిందకు దించారు. అటవీ ప్రాంతంలో కత్తితో గొంతు కోసి, పెట్రోల్ పోసి కాల్చి చంపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి దేవధరణి కనిపించకపోవడంతో సోదరుడు పవన్‌సాయి విశాఖపట్టణం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు చంపడానికి ఉపయోగించిన బాడుగ కారు డ్రైవర్ శివకిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో నేరం అంగీకరించాడు. నిందితుల్లో ఒకడు అరెస్టయ్యాడని, మిగిలిన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. సమావేశంలో పొదిలి సీఐ సుధాకర్‌రావు, తర్లుపాడు ఎస్సై ముక్కంటి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


దేవధరణి(ఫైల్)

గుండ్లకమ్మలో గుర్తుతెలియని మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

కంభం: మండలంలోని తురిమెళ్ల–యర్రబాలెం గ్రామాల మధ్య గుండ్లకమ్మ వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం ఉదయం పరిశీలించారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కథనం మేరకు.. గుండ్లకమ్మ వాగులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి, ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటన జరిగి సుమారు మూడు రోజులై ఉంటుందని, మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై బనియన్ మాత్రమే ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు


ఇంటి గోడను ఢీకొన్న కారు

ముండ్లమూరు: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని శంకరాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. హిందూపురం నుంచి గుంటూరు వెళ్తున్న కారు బుధవారం తెల్లవారుజామున దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలోని శంకరాపురం వద్దకు రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. గ్రామానికి ఉమ్మడి వెంకట్రావు ఇంట్లోకి కారు దూసుకెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న ఉమ్మడి దాసరయ్య, వెంకట్రావు, లక్ష్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అద్దంకిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

లక్కవరం చినచెరువు వేలం ఆదాయం రూ.30.11 లక్షలు


వేలంలో హక్కు దక్కించుకున్న శ్రీనివాసరావు

తాళ్లూరు: మండలంలోని లక్కవరం మైనర్ ఇరిగేషన్ చినచెరువులో మూడేళ్లపాటు చేపలు పెంచుకోవడానికి పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలాన్ని సర్పంచ్ నన్నం వరలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ, ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్, గ్రామ కార్యదర్శి నూరుల్లా పర్యవేక్షించారు. వినుకొండకు చెందిన భీమనాథం శ్రీనివాసులు రూ.30.11 లక్షలకు హక్కు దక్కించుకున్నారు. గ్రామ నాయకులు తూము వెంకట సుబ్బా రెడ్డి, ఉప సర్పంచి పెద్దయ్య, లోకిరెడ్డి నరసింహారెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మలో యువకుడు గల్లంతు

- దూడను బయటకు తెచ్చే క్రమంలో నదిలోకి కొట్టుకుపోయిన వైనం
- ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహం గుర్తింపు


నిడమానూరి అయ్యప్ప(ఫైల్)


గుండ్లకమ్మ నదిలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్న ఫైర్ సిబ్బందితో ఎస్సై శ్రీరామ్

మద్దిపాడు: గుండ్లకమ్మ నదిలోకి వెళ్తున్న గేదె దూడను బయటకు తీసుకొచ్చే క్రమంలో యువకుడు గల్లంతై మృత్యువాత పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన నిడమానూరి అయ్యప్ప(30) మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఊరి శివారులో గేదె దూడలను మేపుతున్నాడు. ఈ క్రమంలో ఓ గేదె గుండ్లకమ్మ నదిని దాటి ఆవల వైపు ఉన్న నడిగడ్డ ప్రాంతానికి వెళ్తుండగా దాని వెనుకే దూడ కూడా నదిలోకి దిగింది. దూడను బయటకు తెస్తే గేదె కూడా వెనక్కి వస్తుందన్న ఉద్దేశంతో దూడను బలంగా లాగుతుండగా అది నదివైపు ఈదడంతో అయ్యప్ప లోపలికి వెళ్లిపోయాడు. చేతిలో ఉన్న తాడును అయ్యప్ప వదిలేయడం, అతనికి ఈత రాకపోవడంతో నదిలో మునిగిపోయాడు. సమీపంలోనే ఉన్న మహిళ కేకలు వేస్తున్నా అయ్యప్ప పట్టించుకోకుండా దూడను లాగడానికి ప్రయత్నించినట్లు సమాచారం. మహిళ గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి నదీ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. గ్రామంలో ఈతగాళ్లు కూడా నదిలోకి వెళ్లి అయ్యప్ప కోసం వెతికారు. మద్దిపాడు ఎస్సై శ్రీరామ్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి వెతుకులాట ముమ్మరం చేయించారు. బుధవారం ఒంగోలు ఫైర్ స్టేషన్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను పిలిపించి వెతుకుతుండగా కిలోమీటరు దూరంలో మృతదేహం కనిపించింది. మృతుడికి గతంలో వివాహం కాగా ఇద్దరూ విడిపోయారు. అయప్ప ప్రస్తుతం తల్లిదండ్రులతోనే ఉంటున్నాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి

- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జేసీ

ఒంగోలు అర్బన్: ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. నోడల్ అధికారులుగా ఎంపిక చేసిన అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలో ఎస్పీ మలికా గర్గ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సామగ్రి సిద్ధం చేయడం, బందోబస్తు, అవసరమైన సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి మైక్రో అబ్జర్వర్లను నియమించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించేందుకు తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. 22 మంది అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, సందీప్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల పరిశీలన

ఒంగోలు: నగరంలోని మామిడిపాలెంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు భద్రపరిచిన గోడౌన్లను బుధవారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పరిశీలించారు. నెలవారీ తనిఖీలో భాగంగా పరిశీలనకు వచ్చిన ఆయన గోడౌన్ నిర్వహణ, భద్రతా చర్యలపై అధికారులతో మాట్లాడారు. గోడౌన్ సీలును పరిశీలించి, సిబ్బంది తగిన సూచనలిచ్చారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.


ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

బైకుల చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

- నిందితుల నుంచి ఏడు బైకులు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఫిరోజ్

గిద్దలూరు రూరల్: బైకుల చోరీ కేసులో ఒక బాలుడితో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు గిద్దలూరు సీఐ ఫిరోజ్ తెలిపారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. గిద్దలూరు పట్టణంలోని ప్రైవేట్ ఒకేషనల్ కాలేజీలో చదువుతున్న ఓ బాలుడు.. కొబ్బరి చెట్లకు మందు కొడతామని చెప్పి తిరుగుతుంటాడు. పగటి పూట ఇంటి పరిసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పట్టణ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల ఇంటి బయట పెట్టిన బైకులను చాకచక్యంగా చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌లను దిగువమెట్టకు చెందిన టంగుటూరి రమేష్, జయరాంపురం తండాకు చెందిన ధర్మానాయక్‌కు విక్రయించి, వచ్చిన డబ్బుతో జల్సా చేస్తున్నాడు. వరుస బైకు చోరీలపై దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. పూర్తి వివరాలు వెల్లడించాడు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు బ్రహ్మనాయుడు, అనిత, కొమరోలు ఎస్సై ఆరాధ్యుల సుబ్బారాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేటెక్కిన నిమ్మ!


లారీలో ఎగుమతి చేస్తున్న నిమ్మకాయలు

హనుమంతునిపాడు: నిమ్మ కాయలకు గిరాకీ పెరిగింది. ధర పెరగడంతో తోటల్లో పక్వానికి వచ్చిన నిమ్మకాయలను కోసి రైతులు కనిగిరి మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత నెలలో కేజీ పండు నిమ్మ కాయల ధర రూ.10, పచ్చి కాయల ధర నాణ్యత, సైజును బట్టి కేజీ రూ.25 నుంచి రూ.30 పలికింది. గత వారం రోజులుగా నిమ్మకు మంచి ధర దక్కుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండలు కాస్త పెరగడంతో నిమ్మ కాయలకు గిరాకీ వచ్చింది. ప్రస్తుతం కేజీ పండు నిమ్మ కాయలు రూ.20 నుంచి రూ.25, పచ్చి కాయల ధర రూ.35 నుంచి రూ.45 పలుకుతోందని రైతులు పేర్కొన్నారు. వ్యాపారులు చెన్నై, బెంగళూరు, తెనాలి, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాలకు నిమ్మ కాయలను జోరుగా ఎగుమతి చేస్తున్నారు.

క్లుప్తంగా

తలశిల రఘురామ్‌ను పరామర్శించిన శిద్దా



రఘురామ్ సతీమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు: ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు బుధవారం పరామర్శించారు. ఇటీవల తలశిల రఘురాం సతీమణి స్వర్ణ కుమారి మరణించిన విషయం తెలిసిందే. విజయవాడలోని గొల్లపూడిలో నిర్వహించిన దశదిన కర్మకు హాజరైన శిద్దా రాఘవరావు.. స్వర్ణకుమారి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం తలశిల రఘురామ్‌ను పరామర్శించారు.

నేడు సర్వసభ్య సమావేశం

గిద్దలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఎంపీపీ కడప లక్ష్మి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

మార్కాపురం టౌన్: జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17 తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవత నైతికతపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యక్షుడు షేక్ సికింధర్ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 88977 76046 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కురిచేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పడమర నాయుడుపాలెం–వీవై కాలనీల మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకుంది. 108 సిబ్బంది అందించిన వివరాల ప్రకారం.. వీవై కాలనీకి చెందిన బి.లక్ష్మయ్య కురిచేడులో బేల్దారి పనులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. పడమర నాయుడుపాలెం దాటగానే తాను వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు గాయమైంది. 108 సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది మహబూబ్‌బాషా, రెహమాన్‌లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శివాలయం అభివృద్ధికి మాజీ మంత్రి శిద్దా విరాళం

దర్శి: మండలంలోని పోతవరం శివాలయం అభివృద్ధికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఆ మొత్తం నగదును ఆయన ప్రతినిధి మందాది సుబ్బారావు అందజేశారు. బుధవారం పోతవరంలో ఆలయ ధర్మకర్త కొప్పురావూరి బాబురావుకు మందాది సుబ్బారావు లక్ష రూపాయల నగదు అందజేశారు.

ఫ్లోరోసిస్‌తో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి అనిల్‌కుమార్

ముండ్లమూరు: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్లోరోసిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి వేము అనిల్‌కుమార్ అన్నారు. చింతలపూడి, ముండ్లమూరు, పెద ఉల్లగల్లులో బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఫ్లోరోసిస్ బారిన పడి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం పలు రకాల యంత్రాలను అందజేస్తామని తెలిపారు. నడుముకు కట్టుకునే బెల్ట్, నడక కర్ర, వీల్ చైర్ ఉచితంగా అందిస్తామని చెప్పారు. అనంతరం ఫ్లోరోసిస్ పరీక్షలు చేశారు. ముండ్లమూరు వైద్యాధికారి వి. జ్యోతి, సీహెచ్‌ఓ నారాయణరావు, హెల్త్ విజిటర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ తీసుకొని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పొదిలి నిర్మలా కాన్వెంట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 41వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమని, ప్రతి పాఠశాలలో విద్యతో పాటు క్రీడలు ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల నిర్వాహకులతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయిరాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె. నరసింహారావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే..

- రూరల్ మండలం ఏర్పాటుపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేనిని సన్మానిస్తున్న ఎంపీపీ పల్లపోలు, తదితరులు

ఒంగోలు రూరల్: ప్రజల రెవెన్యూ సమస్యలు, పాలనాపరమైన సమస్యలు పరిష్కరించేందుకు ఒంగోలు మండలాన్ని రెండుగా విభజించి అర్బన్ మండలంతో పాటు రూరల్ మండలాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూరల్ మండలం ఏర్పాటుపై ఒంగోలు రూరల్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం ఒంగోలులో బాలినేనిని కలిసి సన్మానించారు. దశాబ్ద కాలంగా ఒంగోలు రూరల్ ప్రజలు ఎదురుచూస్తున్న రూరల్ మండలం కోరికను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం ఒంగోలు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తహసీల్దార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బాలినేనిని కలిసి సన్మానించిన వారిలో ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి, ఒంగోలు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జాజుల శ్రీనివాస్, దశరాజుపల్లె చంద్రశేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.

శేష వాహనంపై స్వామి వారు



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలో జరుగుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రోజుకు ఒక అలంకరణలో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఐదో రోజు బుధవారం స్వామి వారు శేషవాహనంపై అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేక అలంకరణ చేసి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలు చీమలమర్రి వెంకట సుబ్బరామకుమార్, రాధాకృష్ణమూర్తి, రామ్మూర్తి, పురుషోత్తమరావులు ప్రత్యేక పూజలు చేసి తమ మెక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు భక్తులకు స్వీకరించారు.

18న మెడికల్ క్యాంప్

మార్కాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న తిప్పాయపాలెంలో డాక్టర్ పగడాల లక్ష్మీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరుణాచల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తరఫున మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వివిధ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న ప్రముఖ సూపర్ స్పెషాలిటీ వైద్యులు సీతల్‌సింగ్, బార్గవ్‌వర్ధన్‌రెడ్డి, కె.నరేంద్రరెడ్డి, వై.కిషోర్‌కుమార్‌రెడ్డి, గౌడ శ్రీహరి, టి.శశిధర్, పీఎల్ వెంకట పక్కిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, వైద్య సంజీవులు హాజరై రోగులకు పరీక్షలు చేస్తారని, మార్కాపురం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని లక్ష్మీరెడ్డి కోరారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

యర్రగొండపాలెం: గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిన నేపథ్యంలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మిరప కోతల సీజన్ పూర్తి కావస్తోందని, కూలీలకు పనులు దొరకక వలస వెళ్లే అవకాశం ఉందన్నారు. వారికి స్థానికంగానే పనులు కల్పించినట్లయితే వలసలు నివారించవచ్చని చెప్పారు. ఆయన వెంట ఏపీఓ నాగేశ్వరరావు, ఈసీ అనీల్ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఏపీఓ కొండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోజూ మూడు వేల మంది కూలీలు పనులు చేయాలని ప్రతిపాదించగా ప్రస్తుతం 2014 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు అడిగిన ప్రతి కుటుంబానికి కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కూలీలకు పనుల వద్ద అన్ని వసతులు కల్పించాలని క్షేత్ర సహాయకులను ఆదేశించినట్లు ఏపీఓ తెలిపారు. ఆయన వెంట సాంకేతిక సహాయకులు అశోక్, క్షేత్ర సహాయకుడు ఫిలిఫ్‌రాజు ఉన్నారు.

దొనకొండలో అభివృద్ధి పనులు

దొనకొండ: దొనకొండలో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టింది. స్పెషల్ గ్రాంట్ రూ.2.60 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లు, సైడు కాలవలు, తారు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ నేమ్ బోర్డు నుంచి ఇండియన్ పెట్రోల్ బంక్ వరకు సిమెంట్ రోడ్డు, సైడు కాలవలు, పెదన్నపాలెం, దొండపాడు గ్రామాల వరకు 5 కిమీ తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. బుధవారం పంచాయతీరాజ్ సెక్షన్ ఇంజినీర్ వై.నాగేశ్వరరెడ్డి, డీఈ జి.కృష్ణ పనులు పరిశీలించారు. నాణ్యత లోపాలు లేకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం



వంటలు పరిశీలిస్తున్న వైద్యాధికారి జ్యోతి

ముండ్లమూరు: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వైద్యాధికారి వి.జ్యోతి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరైన వసతులు ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. ప్రధానంగా తాగునీరు, తరగతి గదులు శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వంట గదులను పరిశీలించారు. వారికి అందుతున్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఆవుల సునీత, సీహెచ్‌ఓ నారాయణరావు ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి బుజ్జిబాయి సూచించారు. బుధవారం గొబ్బూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. విషపూరిత మందులు తక్కువ మోతాదులో వాడాలని, వాటి వలన కలిగే నష్టాలు, మందులు పిచికారీ చేసేటప్పుడు ఉపయోగించాల్సిన మాస్కులు, ధరించవలసిన దుస్తుల గురించి వివరించారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. మండలంలో 1800 మంది ఈకేవైసీ చేయించుకోలేదని, ప్రభుత్వం గడువు పొడిగించిన నేపథ్యంలో సచివాలయాల్లో సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో సమీకృత దాణా

పొదిలి రూరల్: వేసవి కాలం సమీపిస్తూ ఉండటంతో పశువులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ముందస్తుగా సమీకృతదాణాను (టీఎంఆర్) అందుబాటులో ఉంచినట్లు ఉప్పలపాడు పశువైద్యాధికారి డాక్టర్ మంచికల మణిశేఖర్ తెలిపారు. పొదిలి మండలంలో అన్ని సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో దాణాను పశుపోషకులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మండలంలో తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు 668, నల్లజాతి పశువులు 14,171 ఉన్నాయన్నారు. అందరికి సరిపడా టీఎంఆర్ దాణా అందుబాటులో ఉందన్నారు. ఒక్కో కేజీ దాణా రూ.6.50 ధరకు ఇస్తామన్నారు. అవసరమైన రైతులు తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్‌కార్డుతో నమోదు చేసుకోవాలన్నారు.

తుప్పు తెగులు నివారణకు చర్యలు



శనగ పైరును పరిశీలిస్తున్న ఏవో ప్రసాదరావు

తాళ్లూరు: పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి పూట మంచు కారణంగా అనను కూల పరిస్థితుల్లో శనగలో తెగుళ్ల ప్రభావం ఉంటుందని, తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. మల్కాపురం, రజానగరంలో శనగ పైరును బుధవారం పరిశీలించారు. శనగలో వచ్చు తుప్పు తెగులు నివారణ చర్యలను సూచించారు. సర్పంచ్ షేక్ వలి, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు టాలెంట్ టెస్టు

కొమరోలు: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని గురువారం ఛత్రపతి శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ టాలెంట్ టెస్టు 2023 నిర్వహిస్తున్నట్లు సోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థిని, విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని, కొమరోలులోని కొమరోలు పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం ఉదయం 9 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొనవచ్చని, పరీక్ష పత్రం తెలుగు మాధ్యమంలో ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫోరం ఏర్పాటు



చైర్మన్‌కు సమస్య వివరిస్తున్న వినియోగదారుడు

మార్కాపురం టౌన్: రాష్ట్ర విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు విజయవాడలోని గుణదలలో విద్యుత్ ఫోరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ జిల్లా జడ్జి విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖతో ప్రజలకు నష్టాలు కలిగితే పరిష్కరించేందుకు సదస్సు ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారులు కూడా సేవా భావంతో పనిచేస్తున్నారన్నారు. వినియోగదారులకు న్యాయమైన తీర్పులు అందిస్తామని చెప్పారు. సదస్సులో మార్కాపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన హుసెన్ పీరా తనకు ఒకటిన్నర సంవత్సరం క్రితం రూ.66 వేల బిల్లు వచ్చిందని, ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన బాలయ్య శెట్టి తన మీటర్ సక్రమంగా లేదని ఎక్కువ బిల్లు వస్తోందని, దాన్ని మార్చాలని, రాయవరానికి చెందిన సత్యనారాయణ తనకు ఇటీవల రూ.16 వేల కరెంట్ బిల్లు వచ్చిందని, సుంకేసులకు చెందిన మల్లికార్జున రూ.14 వేల కరెంట్ బిల్లు వచ్చిందని ఫిర్యాదు చేశారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని చైర్మన్ ఆదేశించారు. మొత్తం 18 సమస్యల్లో 16 సమస్యలు పరిష్కరించినట్లు డీఈ షియానాయక్ తెలిపారు. సమావేశంలో ఫోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, ఏ.సునీత, ఈఈ నాగేశ్వరరావు, ఏఈ సుబ్బారాయుడు, డివిజన్‌లోని పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

మార్కాపురం టౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల పరీక్షల్లో విజేతలకు బుధవారం పట్టణంలోని అరవింద స్కూల్లో కరెస్పాండెంట్ వాణీరాధాకృష్ణ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సిద్ధార్థ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ జి. శ్రీనివాసరెడ్డి సూచించారు. జేవీవీ నాయకులు రవికుమార్, డీకేఎం రఫీ, ఉపాధ్యాయులు మల్లికార్జున, కేదరిన్, రమేష్ పాల్గొన్నారు.



విజేతలతో జేవీవీ నాయకులు

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీవీవో వెంకటస్వామి

నాగులుప్పలపాడు: ఉపాధి హామీ పథకంలో నమోదైన ప్రతి కుటుంబానికి తప్పకుండా వంద రోజుల పనిదినాలు కల్పించాలని డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి తెలిపారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం మండల కంప్యూటర్ సెల్‌ను పరిశీలించి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క కూలీ అకౌంట్ తప్పనిసరిగా కచ్చితత్వంతో ఉండాలన్నారు. అలాగే మస్టర్ల అనుసంధానం క్రమం తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీవో ధనుంజయ్, ఈసీ విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న రైజ్ విద్యార్థులు

ఒంగోలు: ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని, అలా చేసినందువలన చాలా ఆరోగ్యంగా ఉంటారని రైజ్ కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు అన్నారు. స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో రిమ్స్ వైద్యశాల, రైజ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్ వారి బృందంతో వచ్చి రక్తదానం ఆవశ్యకత, రక్తదానం చేయడం వలన కలిగే మేలు, యువతకు ఉన్న అపోహల గురించి వివరించారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



శనగలో మెళకువలు చెబుతున్న ఏవో పావని

చీమకుర్తి: శనగ పంటలో రైతులు ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపడితే ఖర్చు తక్కువతో కావడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పీ పావని తెలిపారు. మద్దులూరు గ్రామంలో స్థానిక రైతులు సాగు చేస్తున్న శనగ పంటను బుధవారం పరిశీలించి పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. శనగ పంటలో చీడపీడలు వ్యాపించకుండా ఉండేందుకు కార్బన్‌డిజమ్, ట్రైకోడెర్మోటాతో విత్తనాలను శుద్ధి చేసుకోవాలన్నారు. శనగ పంట చుట్టూ జొన్న, సజ్జ పంటలతో పాటు బంతి పూల చెట్లను ఎరపంటలుగా సాగు చేసుకోవాలన్నారు. వాటితో పాటు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం వలన శనగ పంటలకు తెగుళ్లను వ్యాపింపజేసే పురుగులను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

వేలం కేంద్రం అధికారిగా సత్యశ్రీనివాస్



సత్య శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం కేంద్రం రైతు నాయకులు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిగా సత్య శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెల్లంపల్లిలో ఫీల్డ్ ఆఫీసర్‌గా ఈయన పనిచేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం బదిలీపై వెళ్లి అక్కడి నుంచి కలిగిరి వేలం నిర్వహణ అధికారిగా కూడా పనిచేశారు. మళ్లీ వెల్లంపల్లి వేలం కేంద్రం నిర్వహణ అధికారిగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సత్య శ్రీనివాస్‌ను భారత పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం కేంద్రం రైతు నాయకులు అబ్బూరి శేషగిరి, మహేష్, తదితర నాయకులు, వెల్లంపల్లి వేలం కేంద్రం సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

మహిళాభివృద్ధికి కృషి చేయాలి



వినతిపత్రం ఇస్తున్న వీరయ్య మాదిగ, దానియేల్

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి కృషి చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని, అర్హులైన పేద మహిళలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా 3 ఎకరాల భూమి పంపిణీ చేయాలని, జంబు ద్వీపం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, అగ్రకుల పేదలకు 400 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని కోరారు. కన్నతల్లి బాలికల సంరక్షణ కోసం రెండు లక్షల రూపాయలు బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని ప్రభుత్వాలను కోరుతున్నట్లు తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల దానియేల్, జిల్లా నాయకులు విలియం, మహిళ నాయకులు వీరకుమారి, రాణి, లలితమ్మ, మాణిక్యం పాల్గొన్నారు.

ఆ ఆరోపణలు అవాస్తవం

దొనకొండ: పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా దొనకొండలోని అన్ని వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పట్టుకుని నల్లమల కొండల్లో వదిలేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పంచాయతీ వారు పందులు పట్టుకున్నారు. కార్యదర్శి కృష్ణమూర్తి రూ.4 లక్షలు తమను అడిగారని, అందుకు తాము నిరాకరించామని పెంపకందారులు చేసిన మాటలు అవాస్తవమని సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ వెల్లడించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో పంచాయతీ వారు దోహద పడుతుంటే పందుల పెంపకందారులు విద్దూరంగా లేని పోని మాటలు మాట్లాడి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఉప సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీటీసీ గుంటు అజయ్, వార్డు సభ్యులు కె.రామారావు, భట్టు వెంకటేశ్వర్లు, బొందల రాజు, కొమ్మతోటి సుబ్బారావు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

కంభం: మండలంలోని ఎల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను బుధవారం అకడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, వార్షిక ప్రణాళికలు, ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు ఉండేలా చూడాలని, భాషా నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట రమణయ్య, వీరనారాయణ, పిచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బీవీ రామకృష్ణ, వైవీ ఆచారి పాల్గొన్నారు.